
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
శుక్రవారం 11 జూలై 2025



పకడ్బందీగా 'ఆపరేషన్ ముస్కాన్'

- ఎస్పీ మహేశ్ బి. గీతే



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్ బి. గీతే

సిరిసిల్ల క్రైం, జూలై 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పకడ్బందీగా ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తున్నామని, గత 10రోజుల్లో 31మంది పిల్లలను రెస్క్యూ చేశామని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆపరేషన్ ముస్కాన్ బృందంలో ఉన్న అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెస్క్యూ చేసిన పిల్లలను సీడబ్ల్యూసీ ముందు హాజరుపరిచి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించామన్నారు. 18ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకొని వారితో పనిచేయిస్తున్న వారిపై 3కేసులు నమోదుచేశారన్నారు. సమావేశంలో సిరిసిల్ల ఆర్‌డీఓ వెంకటేశ్వర్లు, సిడబ్ల్యూసి ఛైర్‌పర్సన్ కంటం అంజయ్య, సిఐలు నాగేశ్వర్ రావు, ఎస్‌ఐలు లింబాద్రి, లక్‌పతి, సహాయలేబర్ అధికారి నజీర్ మహ్మద్, మెడికల్‌అండ్‌హెల్త్ అధికారి నయిమ్ జహార్, విద్యాశాఖ అధికారి శైలజ, ఏఎస్ఐ ప్రమీల, మహిళా సాధికారత సమన్వయకర్త రోజా తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చట్టాలపై విద్యార్థినులకు అవగాహన



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్

సిరిసిల్ల టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సాయి శ్రీ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం కళాశాల ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ(పీఓసీఎస్ఓ)చట్టం, 2012 చట్టపరమైన అంశాలపై విద్యార్థినీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాయిశ్రీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం తిరుపతి, న్యాయవాదులు చెక్కిల మహేష్‌గౌడ్, గెంట్యాల భూమేష్, అధ్యాపకులు, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

- జిల్లాలో మొదలైన వనమహోత్సవం
- నర్సరీల్లో మొక్కలు రెడీ
- గ్రామాల్లో మొదలైన సందడి
- 10.38 లక్షల మొక్కలు నాటే లక్ష్యం
- 260 నర్సరీల్లో 12.26 లక్షల మొక్కలు

పచ్చదనం వైపు అడుగులు..



వనమహోత్సవ లక్ష్యం...

మండలం	గ్రామ పంచాయతీలు	మొక్కలు
బోయినపల్లి	23	30 వేలు
చందుర్తి	19	70 వేలు
ఇల్లంతకుంట	35	76 వేలు
గంభీరావుపేట	22	76 వేలు
కోనరావుపేట	28	80 వేలు
ముస్తాబాద్	22	75 వేలు
రుద్రంగి	10	10 వేలు
తంగళ్లపల్లి	30	75 వేలు
వీర్నపల్లి	17	75 వేలు
వేములవాడ రూరల్	11	20 వేలు
వేములవాడ అర్బన్	17	10 వేలు
ఎల్లారెడ్డిపేట	26	80 వేలు
మొత్తం	260	6.77లక్షలు

జిల్లాలో నర్సరీల్లో మొక్కలు

మండలం	గ్రామ పంచాయతీలు	మొక్కలు
బోయినపల్లి	23	65,200
చందురి	19	1,31,400
ఇల్లంతకుంట	35	1,58,500
గంభీరావుపేట	22	1,02,700
కోనరావుపేట	28	71,600
ముస్తాబాద్	22	1,30,700
రుద్రంగి	10	29,000
తంగళ్లపల్లి	30	1,56,000
వీర్నపల్లి	17	1,16,000
వేములవాడ రూరల్	11	86,200
వేములవాడ అర్బన్	17	33,000
ఎల్లారెడ్డిపేట	26	1,45,600
మొత్తం	260	12,26,100



మొక్కలు నాటుతున్న అటవీ శాఖ అధికారులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పచ్చదనం వైపు అడుగులు మొదలయ్యాయి. ముక్కవోని దీక్షతో రాజన్న సిరిసిల్లజిల్లాలో వివిధ గ్రామాల్లో వనమహోత్సవం సందడిగా ప్రారంభ మైంది. వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యం మేరకు అనువైన స్థలాలను గుర్తించి వాటికనుగుణంగా మొక్కలు నాటుతున్నారు. జూన్‌లో తొలకరి జల్లులు మురిపించి ముఖం చాటేసిన తర్వాత జిల్లాలో ఏదో ఒకచోట వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు జిల్లాలో వనమహోత్సవ లక్ష్యాన్ని పూర్తి చేయడానికి సంసిద్ధమయ్యారు. వివిధ గ్రామాల్లో సందడిగా మొక్కలు నాటే కార్యక్రమం చురుకుగా కొనసాగుతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 260 గ్రామ పంచాయతీలు, రెండు మున్సిపాలిటీల పరిధిలో 14శాఖల ద్వారా 10.38 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. గత పదవ విడత వనమహోత్సవంలో జిల్లా వ్యాప్తంగా 7.58 లక్షల మొక్కలు నాటే లక్ష్యంగా పెట్టుకొని పూర్తి చేశారు. 11వ వనమహోత్సవంలో జిల్లావ్యాప్తంగా 260 గ్రామపంచాయతీల పరిధిలోని నర్సరీల్లో 12.75 లక్షల మొక్కలు సిద్ధం చేశారు.

● ఉపాధిహామీ లక్ష్యం 6.77లక్షలు

వనమహోత్సవంలో మొక్కలు నాటడం సంరక్షణలో ఉపాధిహామీ లక్ష్యమే ప్రధానంగా ఉంటుంది. 2025-26 సంవత్సరానికి 6.77లక్షల మొక్కలు నాటే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు డీఆర్‌డీఏ ద్వారా 2020-21లో 28,53,745 మొక్కలు నాటగా 27,29,701 మొక్కలు బతికున్నాయి. 2021-2022లో జిల్లా ఉపాధిహామీ కింద 26,78,762 మొక్కలు నాటగా 25,51,234 మొక్కలు బతికి ఉన్నాయి. 2022-23 సంవత్సరంలో 19,17,248 మొక్కలు మిగతా 8లో

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత

సిరిసిల్ల టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని చిన్న పిల్లలందరికి వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు, పర్యవేక్షకులతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత సమావేశం నిర్వహించారు. జాతీయ కార్యక్రమాలపై సాధించిన ప్రగతిపై ప్రతి పీఎస్ వారిగా సమీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడుతూ కాలానుగుణంగా వచ్చే వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశాలున్నాయని అన్నారు. వ్యాధులు ప్రబలకుండా ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. అదే విధంగా గర్భవతులైన మహిళల పేర్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం ఎంహెచ్‌ఎన్ డాక్టర్ ఆల్ఫ్రేడ్, వైద్యాధికారులు సంపత్, రామకృష్ణ, అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ తనిఖీలు..

ముస్తాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీనివాస్ ఎరువులు అండ్ విత్తనాలు, కోరమండల్ మన గ్రోమోర్ విక్రయ దుకాణాలు, గోదాములను, ఆవునూర్ వ్యవసాయ సహకార కేంద్రాలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జలి బేగం, ఏవో దుర్గరాజు, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బూత్ స్థాయి అధికారుల శిక్షణ

సిరిసిల్ల టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గం బూత్ స్థాయి అధికారులకు నిర్వహించిన ఎన్నికల శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. చివరి రోజు జిల్లా కేంద్రంలోని పద్మనాయక కళ్యాణ మండపంలో బూత్ స్థాయిలో జాతీయ ఎన్నికల శిక్షణ తరగతులను నిర్వహించారు. సిరిసిల్ల ఆర్డీవో, ఓటరు నమోదు అధికారి వెంకటేశ్వర్లు బూత్ స్థాయి అధికారులు నిర్వహించాల్సిన బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఓటర్ జాబితా నవీకరణ, ఓటరు చైతన్యం ఓటరు కార్డుల పంపిణీ, పోలింగ్ స్టేషన్‌లలో ప్రాథమిక విధులపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఓటరు నమోదు సహాయ అధికారుల ఎస్ మహేష్, కే భాస్కర్‌రెడ్డి, అశోక్‌నాయక్, మాస్టర్ ట్రైనర్ పాతూరి మహేందర్, బూత్ లెవల్ సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్య దూరం..

సిరిసిల్ల టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యను పేద విద్యార్థులకు దూరం చేస్తుందని బీఆర్ఎస్వీ రాష్ట ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని నర్సింగ్ కళాశాల విద్యార్థుల స్టైఫండ్‌ను విడదల చేయకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెస్‌బిల్లులు చెల్లించాలని కళాశాలల ప్రిన్సిపాల్స్ ఇబ్బంది పెడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా విద్యార్థుల స్టైఫండ్ విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు మెట్టు సాయిదీపక్ రాచమల్ల మోహన్, కనుకుంట్ల వెంకటరమణ, రాచమల్లు రామ్, భరత్, రాము చిరంజీవి, నరేష్, సోఫియాన్, మణిదీప్, సాయి తదితరులు పాల్గొన్నారు.






















కరీంనగర్ కోర్టుకు అఘోరి శ్రీనివాస్

కరీంనగర్ లీగల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రెండో జూనియర్ సివిల్‌కోర్టుకు ఎల్లారి శ్రీనివాస్(అఘోరి) గురువారం హాజరయ్యాడు. గతంలో ఓ యువతిని లైంగికంగా వేధించినట్లు వచ్చిన ఆరోపణలపై కరీంనగర్ జిల్లా కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసువిచారణలో భాగంగా గురువారం అఘోరిని కోర్టులో హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ 14రోజులరిమాండ్ విధించగా పోలీసులు జైలుకు తరలించారు.

పోక్సో కేసులో ఒకరికి పదేళ్ల జైలు

కరీంనగర్ లీగల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో రేకుర్తికి చెందిన అక్కినపల్లి వంశీధర్‌కు పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.6వేలజరిమానా విధిస్తూ కరీంనగర్ మొదటి అదనపుజిల్లా న్యాయమూర్తి వెంకటేశ్ గురువారం తీర్పు చెప్పారు. రేకుర్తికి చెందిన అక్కినపల్లి వంశీధర్ అనే ఆటోడ్రైవర్ ఓ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇంటికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడని, పెళ్లి చేసుకోవాలని అడుగగా బెదిరించి బస్ స్టేషన్‌లో వదిలివెళ్లాడని వంశీధర్‌పై ఆమెతల్లి వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ విజయ్‌కుమార్ కేసు విచారణ చేసి కోర్టులో చార్జిషీట్ వేశారు.

పిచ్చికుక్కల స్వైర విహారం..


● పది మందిపై దాడి

చందుర్తి జూలై 10 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలోని పలు గ్రామాల్లో గురువారం పిచ్చికుక్కలు స్వైర విహారం చేసి పలువురిని గాయపరిచాయి. మండలకేంద్రానికి చెందిన చందుర్తి తిరుపతి, లక్ష్మి, భారతి, హిమాబిందు, మల్లయ్య, దేవేంద్ర, రమ్య, జానాబీ, లక్ష్మీరాజ్యం, రామయ్యతోపాటు అసిరెడ్డిపల్లి, మూడపల్లి, రామన్నపేట, మల్యాల, తిమ్మాపూర్, ఎనగల్ గ్రామాల్లో పలువురిని గాయపరిచాయి. కుక్కకాటు గురైన బాధితులకు చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది వైద్యం అందించారు. గ్రామాల్లో పిచ్చికుక్కలను రక్షించాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను అధికారులను కోరుతున్నారు.

కోతుల దాడిలో రెండు కుక్క పిల్లలు మృతి

చిగురుమామిడి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో ఆదివారం కోతులు చేసిన దాడిలో రెండు కుక్కపిల్లలు మృతి చెందాయి. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో కోతుల దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని గ్రామస్థులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం కుక్కలకు భయపడి కోతులు ఇండ్ల వైపుకు వచ్చేవి కావనీ, కానీకోతులు మూకుమ్మడిగా ఒకబ్యాచ్‌గా ఏర్పడి మనుషులు, జంతువులపై దాడులు చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు కోతులనుపట్టి అటవీ ప్రదేశాలకు తరలించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నిమిషాల్లో ఖాతాలు ఖాళీ



● సామాజిక మాధ్యమాల ద్వారా ఫేక్ లింక్‌లు, సందేశాలు
● ఓపెన్ చేస్తే అంతే
● మూల్ అకౌంట్‌తో తప్పించుకుంటున్న నేరగాళ్లు
● కేసుల్లో చిక్కుకుంటున్న అమాయకులు
● అవగాహన కల్పిస్తున్నా.. మోసపోతున్న ప్రజలు



కరీంనగర్ క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. సామాజిక మాధ్యమాల ద్వారా అమాయకులను లక్ష్యంగా చేసుకొని దోపిడీ చేస్తున్నారు. ఆకర్షణీయమైన లింకులు, సందేశాలు పంపి యువతులతో ఫోన్ కాల్, వీడియో కాల్స్ చేయిస్తూ బ్యాంక్ ఖాతాలు లూటీ చేస్తున్నారు. అపరిచిత వ్యక్తులని తెలిసినా కొందరు యువకులు వలపు వలలో చిక్కుకుంటున్నారు. పరిచయాలు పెంచుకొని చాటింగ్ చేస్తూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. మరికొన్ని ఘటనల్లో తక్కువ సమయంలో డబ్బులు రెట్టింపు అవుతాయని దురాశకు పోయి లక్షలు పోగొట్టుకుంటున్నారు. ఇంకొందరు ఓటీపీలను, పాస్‌వర్డ్‌లను చెబుతూ ఇల్లు గుల్ల చేసుకుంటున్నారు. జరగాల్సిన నష్టం జరిగాకగానీ తేరుకోవడం లేదు. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, ట్విట్టర్ ఖాతాలు, సెల్‌ఫోన్‌లకు నకిలీ సందేశాలు, లింక్‌లు పంపిస్తూ వాటిని తెరిచిన మరుక్షణాల్లో సైబర్ నేరగాళ్ల ఖాళీ చేస్తున్నారు. బాధితుల్లో అధికశాతం చదువుకున్న యువత, ఉద్యోగులు కావడం గమనార్హం. పలు రకాల మోసాలతో సైబర్ నేరగాళ్ల వందల కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు.

● ఆకర్షణీయ ప్రకటనలతో..

సైబర్ నేరగాళ్ల ఒక ఫేక్ సందేశాన్ని పంపిస్తారు. ఆ సందేశానికి స్పందించి ఫోన్ చేయగానే తక్కువ సమయంలో రెట్టింపు డబ్బులు వస్తాయని, ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ లేదా తక్కువధరకు విలువైన వస్తువులు వంటి రకరకాల ఆకర్షణీయమైన ప్రకటనల గురించి చెబుతారు. ఆ తరువాత మాటల్లోపెట్టి మొదట సైబర్ నేరగాళ్లే వెయ్యి రూపాయలు పంపించి ఆ తరువాత ఓటీపీ చెప్పమంటారు. ఓటీపీ చెప్పగానే ఆ ఖాతాలో ఉన్న డబ్బులను సైబర్ నేరగాళ్ల అప్పటికే తెరిచి సిద్ధంగా ఉంచుకున్న మూల్ అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ అవుతుంది. ఆ డబ్బులను నేరగాళ్ల మూల్ అకౌంట్ నుంచి ఇతర అకౌంట్‌లోకి లేదా ఆన్‌లైన్‌లో వస్తువుల కొనుగోలుకు ఉప యోగిస్తారు. బాధితులు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసిన సమయంలో బాధి తుడి డబ్బులు మూల్ అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ జరిగి నట్లు గుర్తించి ఆ మేరకు మూల్ అకౌంట్ ఎవరి పేరిట ఉందో ఆ వ్యక్తిపై కేసును నమోదు చేస్తారు.

● మూల్ అకౌంట్ అంటే..

సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను అరెస్టు చేస్తున్నా రికవరీ శాతం తక్కువ ఉంటుంది. దీనికి ప్రధానకారణం మూల్ అకౌంట్‌కు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయడమే. మూల్ అకౌంట్ అంటే సైబర్ నేరగాళ్ల గ్రామీణ ప్రాంతాల్లోని పేదవర్గాలకు చెందిన అమాయక యువకులను చేరదీసి వారిచేత బ్యాంక్ ఖాతా తెరిపిస్తారు. ఆ ఖాతాకు సంబంధించిన పాస్‌బుక్, ఏటీఎం కార్డు, పిన్‌నంబరు సహా కిట్‌ను సైబర్ నేరగాళ్లే తీసు కుంటారు. ఇందుకు బదులుగా మొదట 10 వేల రూపాయలు చెల్లిస్తారు.

ఆ తరువాత వారి ఖాతాల్లోకి డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయినందుకు లక్ష రూపాయలకు రెండు వేలు, లేదా ఒక్కో లావాదేవికి రెండు వేల చొప్పున ముట్టజెబుతారు. దీనికి ఆశపడి వందలాది మంది అమాయకులు అకౌంట్‌లు తీసి సైబర్ కేసుల్లో ఇరుక్కుంటున్నారు. అసలు సైబర్ నేరగాళ్ల మొదట ఎక్కడ కనిపించరు. మూల్ అకౌంట్ నుంచి ఎక్కడికి డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయ్యాయనేది విచారిస్తే అప్పుడు వెల్లడవుతుంది. అప్పటికే డబ్బులు ఖర్చు పెడుతుండడంతో ఆ ఖాతాను ఫ్రీజ్ చేసినా లాభం లేకుండా పోతోంది.

కరీంనగర్ జిల్లాలో మూడేళ్లలో సైబర్ మోసాలు

సైబర్ నేరాల నియంత్రణకు పోలీసులు ఓ వైపున అవగాహన కల్పిస్తున్నా మరో వైపున యువత సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి ఆర్థికంగా నష్టపోతున్నారు. చివరకు న్యాయం కావాలంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు.కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మూడేళ్లలో జరిగిన సైబర్ నేరాలు...

● 2022లో 1,336 సైబర్ కేసులు నమోదవగా 4.46 కోట్ల రూపాయలు నష్టపోయారు.

● 2023లో సైబర్ మోసాలపై 1,654 ఫిర్యాదులు అందగా వాటిలో బాధితులు 11.48 కోట్ల రూపాయలు నష్టపోయారు. ఇందులో కోటి 70 లక్షలు దేశవ్యాప్తంగా బ్యాంక్‌లలో సీజ్ చేశారు. వచ్చిన ఫిర్యాదులపై 258 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసి 32 మంది నిందితులను అరెస్టు చేశారు.

● 2024లో జిల్లా వ్యాప్తంగా 2,282 సైబర్ మోసాలపై ఫిర్యాదులు అందగా, ఇందులో రూ.9.87 కోట్లు దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంక్‌లలో సీజ్ చేశారు. వచ్చిన ఫిర్యాదులపై 270 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు.



దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

కరీంనగర్ క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మహిళమెడలో గొలుసు దొంగిలించిన కేసులో హౌసింగ్‌బోర్డుకాలనీకి చెందిన చింతకింది సదాశివ, టేకుమల్లనాగరాజును గురువారం అరెస్టు చేసినట్లు త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. జల్సాలు, ఆన్‌లైన్ గేమ్‌లతో సదాశివ, నాగరాజు అప్పులపాలయ్యారు. అప్పులు తీరాలంటే ఏదో ఒకటిచేయాలని పథకం రచించారు. కరీంనగర్ మారుతీనగర్‌లో ఒంటరిగా నివాసం ఉంటున్న స్వరూప కదలికలను గమనించారు. బుధవారం వేకువజామున 3:30 గంటల ప్రాంతంలో స్వరూప బంధువైన మరో మహిళ కూరగాయలు విక్రయించేందుకు ఇంటినుంచి బయటకు వెళ్తూ బయట నుంచి గడియపెట్టింది. గమనించిన నిందితులు స్వరూప ఇంట్లోకిచొరబడి నిద్రిస్తున్న ఆమె ముఖానికి దిండు అదిమిపట్టి మెడలోని బంగారు గొలుసును తెంపుకొని పారిపోయారు.

సీసీ కెమెరాలు పరిశీలించిన పోలీసులు సంఘటన స్థలంలో గుర్తిం చిన వస్తువుతో నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 42.5గ్రాముల బంగారు గొలుసు, ద్విచ క్రవాహనం, సెల్‌ఫోన్‌ల స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

సవరణ

'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ఈనెల 10న 'ఆరు నెలలకు రెట్టింపు డబ్బుల పేరిట మోసం' శీర్షికన ప్రచురితమైన వార్తలో తప్పు దొర్లింది. జనాల వద్ద డబ్బులు వసూలు చేసి మోసంచేసిన కేసులో కరీంనగర్ సైబర్‌క్రైం పోలీసులు ఖమ్మం జిల్లాకేంద్రానికి చెందిన రాజేంద్ర మూర్తిని అరెస్టు చేశారు. రాజేంద్రమూర్తి పేరుకు బదులు పొరపాటుగా రాంచంద్రమూర్తి అని ప్రచురిత మైంది. పేరు తప్పుగా వచ్చినందుకు చింతిస్తున్నాం. ఈ కేసుతో రాంచంద్రమూర్తికి ఎటువంటి సంబంధం లేదు. గమనించగలరు.

- ఎడిటర్

మత మార్పిడికి యత్నించిన ఇద్దరిపై కేసు

జగిత్యాల క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మత మార్పిడికి యత్నించిన ఇద్దరు వ్యక్తులపై జగిత్యాల పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రి ప్రాంతానికి చెందిన పల్లపు శివ, జ్యోతి అనే ఇద్దరు వ్యక్తులు జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంకు చెందిన శివసాయి అనే యువకుడిని కలిసి చర్చి ఫాదర్‌లుగా పరిచయం చేసుకున్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ఇంటిలో మత మార్పిడి కావాలని బలవంతం చేశారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

రూ.7450 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయమార్కెట్లో కింటాల్ పత్తిధర రూ.7450 పలికింది. గురువారం మార్కెట్‌యార్డుకు ముగ్గురు రైతులు 50కింటాళ్ల పత్తివిక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.7450, కనిష్ఠ ధర రూ.7100చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం

● మృత్యువులోనూ వీడని స్నేహబంధం



భానుప్రసాద్ (ఫైల్), నరేష్ (ఫైల్)

తిమ్మాపూర్ (మానకొండూర్), జూలై 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట గ్రామశివారులో గురువారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మణం చెందారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకికి చెందిన కోడూరి రేణుక-మొగిలి దంపతుల కుమారుడు భానుప్రసాద్(19), కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలోని చీమలకుంట గ్రామానికి బామండ్ల కొమురయ్య కుమారుడు బామండ్ల నరేష్(17) ఇద్దరు ప్రాణస్నేహితులు. వీరు ఇద్దరు కలిసి బుధవారం రాత్రి 9గంటలకు మోటారు బైక్‌పై కరీంనగర్‌కు వెళ్లారు. పని ముగించుకొని గురువారం తెల్లవారుజామున తమ స్వగ్రామాలకు బయలుదేరారు. ఈ క్రమంలో రేణికుంట గ్రామంలోని సాయిబాబా గుడి సమీపంలో వెనకాల వస్తున్న గుర్తుతెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహలను పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ తరలించారు. భానుప్రసాద్ తల్లి రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు

కోతుల దాడిలో గాయపడిన వ్యక్తి మృతి



సుదర్శన్(ఫైల్)

హుజూరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కోతులదాడిలో గాయపడిన ఓవ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన గురువారం హుజూరాబాద్‌లో చోటుచేసుకుంది. పట్టణంలోని ప్రతాపవాడకు చెందిన బుర్ర సుదర్శన్(65) తహసీల్దార్‌కార్యాలయంలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. నెల రోజుల క్రితం ఇంటి వద్ద సుదర్శన్‌పై కోతులు దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా, కాలుకు ఇన్‌ఫెక్షన్ సోకింది. దీంతో చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు. సుదర్శన్ మృతదేహానికి తహసీల్దార్ కనకయ్య, డీటీసందీప్, ఆర్‌ఐ రంజిత్‌తోపాటు సిబ్బంది పూలమాలలువేసి ప్రగాఢసానుభూతిని వ్యక్తంచేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి కోతులబెడద లేకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్(ఫైల్)

గంబీరావుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా గంబీరావుపేట మండలం నర్మాలలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. నర్మాలకు చెందిన లోకం శ్రీకాంత్(25) అనే యువకుడు డిగ్రీ పూర్తిచేసి, టెక్నికల్‌కోర్సులు కూడా నేర్చుకున్నాడు. ఏడాదినుంచి హైదరాబాద్‌లో ఉంటూ ఉద్యోగప్రయత్నాలు చేస్తున్న శ్రీకాంత్ గ్రూప్-4తో పాటు వివిధ పరీక్షలు రాశాడు. అయినా శ్రీకాంత్‌చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. బుధవారం సాయంత్రం నర్మాలకు వచ్చిన శ్రీకాంత్ గురువారం ఉదయాన్నే తమ పొలం వద్ద ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉద్యోగం రావడం లేదనే బెంగతో శ్రీకాంత్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతుడితల్లి మణెమ్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రమాకాంత్ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో అక్రమ నిర్మాణాల తొలగింపు

కరీంనగర్ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు నగరపాలకసంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగం ప్రత్యేకచర్యలు చేపట్టింది. కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశాల మేరకు నగరపాలకసంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్, డీటీఎఫ్ బృందం గురువారం అక్రమ నిర్మాణాలను తొలగించింది. నగరంలోని బ్యాంక్‌కాలనీలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన టిన్‌షెడ్డును, ఆరెపల్లిలో రోడ్డును ఆక్రమించి కట్టిన కంపౌండ్‌వాల్, షెడ్డును తొలగించారు.

ఇసుక క్వారీలో ఉపాధి కోసం రిలే నిరాహార దీక్షలు



హిమ్మత్‌నగర్‌లో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న గ్రామస్థులు

వీణవంక, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో కొండపాక మానేరు వాగు ఇసుక క్వారీలో లారీలపై పరదలు కప్పే ఉపాధి కల్పించాలని కోరుతూ గ్రామస్థులు గురువారం రిలే నిరహార దీక్షలు చేపట్టారు. కొండపాక గ్రామరెవెన్యూ పరిధిలోనే తమ గ్రామం ఉందని తమ గ్రామం నుంచే రోజు వందలాది లారీలు వెళ్తున్నాయని తమ గ్రామంలోని నిరుపేదలకు ఉపాధి కల్పించాలని కోరారు. మూడు నెలలుగా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని తెలిపారు. ఇసుక క్వారీలతో తమ గ్రామానికే ఎక్కువ నష్టం జరుగుతోందని అన్నారు. తమ గ్రామస్థులకు ఉపాధి కల్పించేలా చూడాలని అన్నారు. రిలే నిరాహార దీక్షలతో స్పందించకుంటే ఆమరణ నిరహదీక్షలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్థులు గెల్లు మల్యయ్య, నల్ల తిరుపతి రెడ్డి, నల్ల కొండాల్‌రెడ్డి, గెల్లు రమేష్, తిరుపతిరెడ్డి, రాజు, తదితరులున్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు

● అయిదు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ పట్టివేత



పట్టుబడిన ట్రాక్టర్‌తో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

ముస్తాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వి తరలిస్తున్న వాహనాలపై కేసు నమోదు చేసి ఠాణాకు తరలించినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నటేశ్ గురువారం తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిప్పలపెల్లి గ్రామశివారులో మట్టిని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్పీ ఆదేశాలతో దాడులు చేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న అయిదు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకొని ముస్తాబాద్ పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు చేపట్టినా, రావాణా చేసినా కేసులు తప్పవని హెచ్చరించారు. రావాణా చేయాలంటే సంబంధించిన శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని లేకపోతే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీసీలు దామోదర్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఐదు ధాన్యం లారీల పట్టివేత

● రైస్‌మిల్లుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు



అధికారులు పట్టుకున్న ధాన్యం లారీ

సుల్తానాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో ఐదు ధాన్యం లారీలను సివిల్ సప్లయిస్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు గురు వారం రాత్రి పట్టుకున్నారు. సుల్తానాబాద్‌లోని రెండు రైస్‌మిల్లుల నుంచి లోడింగ్ అయి బయటకు వచ్చిన ధాన్యం లారీలను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఐదులారీలు లోడింగ్ అయిన మిల్లుల వద్ద అధికారులు తనిఖీ చేస్తున్నారు. ప్రభుత్వం ఈ మిల్లులకు అప్పగించిన ధాన్యం ఎంత, ఇప్పటివరకు సీఎంఆర్ కింద ప్రభుత్వానికి అప్పగించింది ఎంత, ప్రస్తుతం మిల్లులో ఏ మేరకు నిల్వలు ఉన్నాయో రికార్డులు నమోదు చేస్తున్నారు. పూర్తివివరాలు శుక్ర వారం ఉదయం వరకు తెలుస్తాయని అధికారులు తెలిపారు. పట్టుకున్న ఐదు లారీలను స్టేషన్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడులు విజిలెన్స్ ఎన్‌పోర్స్‌మెంట్ ఓఎస్డీ ఆధ్వర్యంలో కమిషనర్ చౌహన్ ఆదేశాలతో ఎస్పీ శశిధర్ రాజు పర్యవేక్షణలో జరిగినట్లు అధికారులు తెలిపారు.

వడ్డీవ్యాపారులు, ఫైనాన్స్‌లపై పోలీసుల కొరడా

● జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో దాడులు..
● 10మందిపై కేసులు
● రూ.60లక్షల విలువైన డాక్యుమెంట్స్, వాహనాలు సీజ్



సిరిసిల్లలో వడ్డీ వ్యాపారుల ఇంట్లో సోదాలు చేస్తున్న టౌన్ సీఐ కృష్ణ

సిరిసిల్ల క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్‌లపై పోలీసులు కొరడా ఝుళిపించారు. ఎస్పీ మహేశ్ బి. గీతే ఆదేశాల మేరకు జిల్లాలోని 13 పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న వడ్డీ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాల్లో పోలీసు బృందాలు దాడులు చేశాయి. ఈ సందర్భంగా ఎస్పీ మహేశ్ బి. గీతే మాట్లాడుతూ జిలా వ్యాప్తంగా అనుమతులు లేకుండా అక్రమ వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై 20 బృందాలు ఏకకాలంలో ఆకస్మిక దాడులు నిర్వహించాయన్నారు. అక్రమ వడ్డీ, ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్న సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన నల్ల ప్రదీప్, నెహ్రూనగర్‌కు చెందిన దూస శ్రీనివాస్, దుబాల మోండయ్య, ఉషాకోయిల మనోహర్, శివనగర్‌కు చెందిన ఎనగందుల శ్రీహరి, ఎల్లారెడ్డిపేటకు చెందిన వొడ్నాల ఆంజనేయులు, బోయిన్‌పల్లికి చెందిన మెడిశెట్టి పురుషోత్తం, ఇల్లంతకుంట మండలంలోని తాళ్లల్లపల్లికి చెందిన గొర్ల రాములు, గంబీరావుపేటకు చెందిన దండవేని అశోక్, మల్లారెడ్డిపేటకు చెందిన బొందుగుల జగదీశ్వర్‌పై కేసు నమోదు చేశామన్నారు. వీరి వద్ద 60 లక్షల రూపాయల విలువైన డాక్యుమెంట్లు, తాకట్టు పెట్టుకున్న నాలుగు ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. అధిక వడ్డీలతో సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని వడ్డీలకు డబ్బులు ఇచ్చి వారి నుంచి అధిక వడ్డీ వసూలు చేసే వ్యాపారులపై నిఘా పెంచామన్నారు. ఆర్‌బీఐ నిబంధనలను, మనీ లెండింగ్ చట్టంలోని నిబంధనల ప్రకారం చట్టబద్ధంగా ఎవరైనా లైసెన్స్‌తో అప్పులు ఇవ్వవచ్చన్నారు. అధిక వడ్డీ రేట్లతో సామాన్యులపై దౌర్జన్యం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఊపిరి తీసిన మోసం

● యువకుడి మృతి



రాజ్‌కుమార్(ఫైల్)

వేములవాడ రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : జీవితంలో స్థిరపడాలన్న కోరిక, తల్లిదండ్రులను బాగా చూసుకోవాలనే ఆ యువకుడి ఆశయం మోసానికి బలైంది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం నూకలమర్రి గ్రామానికి చెందిన పెద్దవేని మల్లయ్య, నర్సమ్మల కుమారుడు రాజ్‌కుమార్(22) ఉపాధి నిమిత్తం కామారెడ్డి, ముంబాయి ఏజెంట్ల ద్వారా గత నెల సౌదీవెళ్లాడు. డ్రైవర్ పనికి వీసా వచ్చిందని ఏజెంట్లు తెలిపారని, తీరా సౌదీకి వెళ్లాక లేబర్ పని చేయించారని, దీంతో తాను మోసపోయానని కుటుంబ సభ్యులకు రాజ్‌కుమార్ తెలిపాడు. పనిచేసే చోట సదరు సిబ్బంది తీవ్రంగా కొట్టడంతో భయాందోళనకు గురై మంగళవారం రాజ్‌కుమార్ హైదరాబాద్‌కు చేరుకున్నాడు. గాయాలతో ఓ ఆసుపత్రిలో చేరిన రాజ్‌కుమార్ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

దివ్యాంగుల ఉపాధి పునరావాస పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ అర్బన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల ఆర్థికస్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల ఉపాధి పునరావాస పథకం ప్రవేశపెట్టిందని జిల్లా సంక్షేమఅధికారి ఎం.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు లింకేజీ లేకుండా వందశాతం సబ్సిడీతో 50వేలు, బ్యాంకులింకేజీతో 80, 70, 60శాతం సబ్సిడీతో లక్ష, రెండు లక్షలు, మూడు లక్షల రూపాయల వరకు 21యూనిట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కనీసం 40 శాతం దివ్యాంగత్వం ఉండి, 21-55 సంవత్సరాల్లోపు వయస్సు, గ్రామీణ ప్రాంతాల వారికి లక్షా 50 వేలలోపు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షలలోపు ఆదాయ పరిమితి ఉన్నవారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు గత 5సంవత్సరాల్లో ఏదైనా ప్రభుత్వ సంస్థ నుంచి సబ్సిడీ పొంది ఉండకూడదని పేర్కొన్నారు. అర్హులు ఈనెల 14 నుంచి 31లోగా tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తదుపరి జిల్లాస్థాయి సెలెక్షన్ కమిటీ ద్వారా ఎంపిక చేస్తారని పేర్కొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

సుభాష్‌నగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకరమణ సూచించారు. గురువారం ఆశా సూపర్‌వైజర్లు, మహిళా సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమీక్షాసమావేశంలో మాట్లాడారు. సిజేరియన్ డెలివరీతో ఉత్పన్నమయ్యే అనారోగ్య సమస్యలను వివరించాలని సూచించారు.

అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ల్యాబ్ టెక్నీషియన్లు, హెల్త్‌అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. పీవో డీటీటీ డాక్టర్ఉమశ్రీ, ఎంసీహెచ్‌పీవో డాక్టర్ సనజవేరియా, డీసీహెచ్‌ఎస్‌వో విమల పాల్గొన్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

▸ ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

కరీంనగర్ జిల్లా, జులై 10: పులిపిర్లకు వడియార మల్లికార్జున (విశిష్ట పురస్కారం మరియు జాతీయస్థాయిలో "వైద్యశ్రీ" అవార్డు గ్రహీత) అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. కరీంనగర్ జిల్లా, గీతాభవన్ సర్కిల్, వెంకటేశ్వర థియేటర్ ప్రక్కన, హోటల్ శ్రీనివాస, కరీంనగర్ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. శుక్ర, శనివారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

కేసులున్న వ్యక్తి సీఎంగా ఉండడం దురదృష్టకరం

- ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారు
- బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మల్లాపూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్


మల్లాపూర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసులో దొరికిన వ్యక్తి, 89 కేసులున్న రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండడం దురదృష్టకరమని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. గురువారం జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. రైతు రాజ్యం ఎవరు తెచ్చారో బహిరంగ చర్చకు వస్తామని చెప్పి సీఎం తప్పించుకొని విమానాలు ఎక్కి ఢిల్లీకి పారిపోతున్నాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు రాష్ట్రాన్ని పాలించే నైతిక హక్కు లేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రొటెక్షన్ ఫోర్స్‌గా బీజేపీ నాయకులు పని చేస్తున్నారని ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు యూరియా ఇవ్వడంలో విఫలమయ్యాయన్నారు. ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుంటే కాంగ్రెస్, బీజేపీలను గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థులు పాముకాటుకు గురైతే మంత్రులు వెళ్లి బాధితులను ఆదుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. అనంతరం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. కేటీఆర్ విసిరిన సవాల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి తోక ముడిచారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీ ఎల్.రమణ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, జాన్సన్ నాయక్, లోక బాపురెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై ఫిర్యాదు

జగిత్యాల క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రసాద్‌పై గురువారం బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన యువతి ఎస్పీ అశోక్ కుమార్‌కు ఫిర్యాదు చేసింది. ప్రసాద్ తనను వివాహం చేసుకొని మరో యువతిని మోసం చేస్తున్నాడంటూ ఎస్పీకి బాధిత యువతి ఫిర్యాదు చేసింది. కానిస్టేబుల్‌పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని యువతి కోరింది.

లక్ష్మీనృసింహస్వామి భక్తుల నిలువు దోపిడీ

- నాంపల్లి గుట్టపై కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- అసహనం వ్యక్తం చేస్తున్న భక్తులు
- పట్టించుకోని అధికారులు



వేములవాడ కల్చరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన నాంపల్లి లక్ష్మీనృసింహ స్వామి భక్తులు కాంట్రాక్టర్ల చేతిలో నిలువుదోపిడీకి గురువుతున్నారు. రాజరాజేశ్వర స్వామి ఆలయానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వచ్చి రాజన్నను దర్శించుకుని నాంపల్లి గుట్టపైన స్వయంభుగా వెలిసిన లక్ష్మీనృసింహ స్వామి వారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో నాంపల్లి గుట్టపైన నిత్యం భక్తుల రద్దీ కనిపి స్తుంది. అయితే గుట్టపైకి వచ్చే భక్తులను కాంట్రాక్టర్లు నిలువునా దోచుకుంటున్నారు. అయినా సంబంధిత అధికారులుపట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

ఒక్కో దీపం రూ. 100 చెల్లించాల్సిందే..

నాంపల్లి లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులు ముందుగా కొండపైన కొలువుదీరిన స్వామి వారిని దర్శించుకుని టెంకాయ కొడుతారు. టెంకాయకు భక్తుల వద్ద రూ. 50 నుంచి 60 వరకు వసూలు చేస్తున్నారు. టెంకాయతో పాటు కుంకుమ, పసుపు, గాజులు వేసి రూ.100 వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా కొండ మధ్య భాగంలో ఏర్పాటు చేసిన కాళీయమర్ధనంలోని ఉగ్రనృసింహస్వామి వారిని దర్శించుకుంటారు. కాళీయమర్ధనంలోకి వెళ్లేందుకు ఆలయం తరపున ఒక్కొక్కరికి రూ.5 టికెట్‌ను తీసుకుని వెళ్లాల్సి ఉంటుంది. ఇలా వచ్చిన డబ్బులను ఆలయ ఖజానాకు సంబంధిత ఉద్యోగి జమ చేస్తారు. అయితే కాళీయ మర్ధనంలోకి వెళ్లిన భక్తులకు కాంట్రాక్టర్ల తీరుతో చేదు అనుభవం ఎదురవుతోంది.

ఉగ్రనృసింహస్వామి వద్ద ఏర్పాటు చేసిన ఒక ప్లేట్‌లో నాగఫణి విగ్రహాన్ని పెట్టి పాలతో అభిషేకం చేయాలని భక్తులకు సూచిస్తున్నారు. అలా పాలు పోసేందుకు (చిన్నపాటి గ్లాస్‌కు, నూనేతో ఉన్న చిన్న గురిగికి) రూ. 50 వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా కాలీయమర్ధనంలో కొత్తగా దీపాలు వెలిగించే ప్రక్రియను సృష్టించారు. దానికి కాంట్రాక్టు దక్కించుకున్న వ్యక్తులు తమ ఇష్టానుసారంగా ఒక్కో దీపానికి రూ. 100 వసూలు చేస్తున్నారు. చిన్న దీపానికి రూ. 50 వసూలు చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నించిన భక్తులతో వాగ్వాదానికి దిగుతూ దురుసుగా ప్రవర్తిస్తున్నారని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అలాగే కాళీ యమర్ధనం ముందు భాగంలో ఫొటోలు తీసుకునేందుకు ఓ వ్యక్తి కాంట్రాక్టు దక్కించుకున్నాడు. ఫోటో సైజ్‌లను బట్టి నిర్ణయించిన ధరలకన్నా ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు.



ఈ ఒక్క దీపానికి వంద రూపాయలు

కనిపించని ధరల సూచిక బోర్డులు..

నాంపల్లి లక్ష్మీనృసింహస్వామి గుట్టపైన కొబ్బరికాయలు, నూనే, పాలు, దీపాలు, ఫోటోలు తీసే వ్యక్తులు టెండర్‌లను దక్కించుకున్నారు. కాంట్రాక్టర్‌లు క్వాలిటీ, పరిమాణం, ధరతో కూడిన సూచిక బోర్డులను ఆలయాధికారులు భక్తులకు తెలిసేలా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. గుట్టపైన ఎక్కడా సూచిక బోర్డులు కనిపించకపోవడంతో కాంట్రాక్టర్లు ఎంత ధర నిర్ణయిస్తే అంతకు భక్తులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఈనెల 25వ తేది నుంచి శ్రావణ మాసం ప్రారంభమవుతుంది. నాంపల్లి లక్ష్మీనృసింహస్వామి గుట్టపైకి నిత్యం రెండు వేల మంది వరకు భక్తులు దర్శనానికి వస్తుంటారు. టెండర్ల ద్వారా ఆలయంలో నిర్ణయించిన ధరల సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

అధిక ధరలు వసూలు చేయడం సరికాదు..
గడప కిషోర్, విశ్వహిందూ పరిషత్, వేములవాడ



నాంపల్లి గుట్టపైన భక్తుల వద్ద అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. గతంలో ఉన్న ఈవోకు ఫిర్యాదు చేశాం. గుట్టపై కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరికాదు. సంబంధిత అధికారులు గుట్టపైన, కింద, మధ్యలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

సివిల్స్ ఉచిత శిక్షణకు రేపు స్క్రీనింగ్ టెస్ట్

గణేశ్‌నగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ ఉచితశిక్షణ కోసం ఉమ్మడి కరీంనగర్‌జిల్లా (జగిత్యాల, పెద్దపల్లి), మంచిర్యాల జిల్లాకుచెందిన అభ్యర్థులకు శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 2వరకు ఆన్‌లైన్ స్క్రీనింగ్‌టెస్ట్ నిర్వహించనున్నట్లు కరీంనగర్ జిల్లా స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత ఇంజనీరింగ్ కళాశాలల్లో హాజరుకావాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రానికి 30 నిమిషాల ముందు చేరుకోవాలని, వివరాలకు 0878-2268686 నంబరులోగానీ బీసీ స్టడీసర్కిల్, కరీంనగర్ కార్యాలయం పని వేళలలోగానీ సంప్రదించాలని సూచించారు. హాల్‌టికెట్లువెబ్‌సైట్ http://tgbcstudycircles.cgg.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలి పారు.

రేపటి నుంచి ఆల్ ఇండియా జూనియర్స్, ఓపెన్ చెస్ టోర్నీ

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వేదికగా జీనియస్ చెస్ అకాడమీఆధ్వర్యంలో 3వఆల్ ఇండియా చెస్‌టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్, కోచ్ కంకటి అనూప్‌కుమార్ తెలిపారు. గురువారం పోటీలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అకాడమీ ఆధ్వర్యంలో గతంలో జిల్లాకేంద్రంలో రెండుసార్లు ఆల్‌ఇండియాస్థాయిలో పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. అదేస్ఫూర్తితో ఈ నెల12,13తేదీల్లో కరీంనగర్‌లోని వి కన్వెన్షన్‌లో పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, అకాడమీ వ్యవస్థాపకుడు కంకటి కనుకయ్య, కో-ఆర్డినేటర్లు స్రుజన్ కుమార్, సతీష్‌బాబు, పెటా ప్రధాన కార్యదర్శి ఆడెపు శ్రీనివాస్, జిల్లా ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బత్తిని శ్రీధర్‌గౌడ్, దారం శ్రీనివాస్ రెడ్డి, శివకృష్ణ, మహిపాల్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీలపై మెడికల్ కౌన్సిల్ దాడులను ఆపాలి

సుభాష్‌నగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మెడికల్‌కౌన్సిల్ మెంబర్లు ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా ఆర్ఎంపీ, పీఎంపీలపై నిర్వహిస్తున్న దాడులను ఆపాలని ఆ సంఘం బాధ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం నగరంలోని ఓవంక్షన్ హాలులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రాత్రి, పగలు ప్రాథమిక చికిత్స అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలను దొంగలు, నకిలీ వైద్యులుగా చిత్రీకరిస్తూ కేసులు నమోదు చేస్తామనడం బాధాకరమన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దొంతుల మనోహర్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు రవిందర్‌రెడ్డి, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు శ్రీనివాసమూర్తి, రాజేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బీచ్ కబడ్డీ ఇండియన్ శిబిరానికి సాయిప్రియ



సాయిప్రియను సన్మానిస్తున్న జిల్లా కబడ్డీ సంఘ సభ్యులు

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బీచ్ కబడ్డీ మహిళల ఇండియన్ శిబిరానికి జిల్లాకు చెందిన క్రీడాకారిణి గోలి సాయిప్రియ ఎంపికైంది. కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆగస్టు మొదటివారంలో పోటీలు ప్రారంభంకానున్నట్లు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీరేశం, మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా మచిలీపట్నంలో జూన్‌లో జరిగిన సీనియర్ మహిళల బీచ్ కబడ్డీ జాతీయ స్థాయి పోటీల్లో సాయిప్రియ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. గురు వారం కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లాకబడ్డీ సంఘం ఆధ్వర్యంలో సాయిప్రియను సన్మానించారు. జిల్లాకబడ్డీ అసోసియేషన్ చీఫ్‌ప్యాట్రన్ డాక్టర్ ప్రసాద్‌రావు, అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అమిత్‌కుమార్, మల్లేష్‌గౌడ్, వైస్‌ప్రెసిడెంట్ అనూకర్‌రావు, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి శేఖర్‌రావుకు గౌరవ డాక్టరేట్ ప్రదానం

కరీంనగర్ టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ముప్పై ఏళ్లగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్న విద్యావేత్త, ట్రస్మా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, ప్రజ్ఞావికాస్ రాష్ట్ర అధ్యక్షుడు, వాల్మీకి, నందిని విద్యాలయాల అధినేత యాదగిరిశేఖర్‌రావు గౌరవడాక్టరేట్ అందుకు న్నారు. ఆయన సేవలకు గుర్తించిన హోప్ థియోలాజికల్ యూనివర్సిటీ వారు బుధవారం రాత్రి డాక్టరేట్ ప్రదానం చేశారు. విద్యాసంస్థల బలోపేతం, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధితోపాటు అనేక సామాజిక కార్యక్రమాలకు సముచిత గుర్తింపు లభించిందని నగరానికి చెందిన పలు విద్యాసంస్థల అధినేతలు, కరస్పాండెంట్‌లు, ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అన్నారు. ఈ సందర్భంగా శేఖర్‌రావును సన్మానించారు.



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న యాదగిరి శేఖర్‌రావు

మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

- డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

రామడుగు, జులై 10 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్ టీచర్లకు జీరో వన్ జీరోపద్దు కింద ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వడడంతోపాటు వారి సమస్యలు పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్రఉపాధ్యక్షుడు వి రాజిరెడ్డి అన్నారు. గురువారం రామడుగు మోడల్ స్కూల్‌తోపాటు వివిధ పాఠశాలల్లో డీటీహెచ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇహెచ్ఎస్ పథకం అమలుచేయాలని, మరణించిన ఉపాధ్యా యుల డిపెండెంట్లకు కంపాషినేట్ అపాయింట్‌మెంట్ ద్వారా ఉద్యోగాలు ఇవ్వాలని, విద్యార్థులసంఖ్య అధికంగా ఉన్న సందర్భంలో సెక్షన్‌గా పరిగ ణించి అదనపు ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్రకౌన్సిల్ సభ్యులు సముద్రాల అంజయ్య, రామడుగు మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఇప్ప నరసిం హారెడ్డి, ఎండీ సర్వర్, జిల్లాకౌన్సిల్ సభ్యులు వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

శ్రీరాములపల్లిలో స్వచ్ఛతపై సర్వే



శ్రీరాములపల్లిలో స్వచ్ఛతపై సర్వే చేస్తున్న బృందం

రామడుగు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాములపల్లిలో కేంద్రప్రభుత్వ బృందం ఆధ్వర్యంలో అకాడమీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ అనే సంస్థ గురువారం స్వచ్ఛతపై సర్వే నిర్వహించింది. సూపర్‌వైజర్ రజిత పర్యవేక్షణలో చెత్తసేకరణ తీరు, పారిశుధ్య సిబ్బంది చెత్త తరలింపు, ప్రభుత్వసంస్థల పనితీరును, వ్యర్థాల నిర్వహణ, సెగ్రిగేషన్ షెడ్‌లో ఎరు వుల తయారీ, ప్లాస్టిక్ వినియోగం, ఇంకుడు గుంతల నిర్మాణం, శుద్ధమైన తాగునీటి సరఫరా, తదితర అంశాలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్ రాజేశ్వరి, మండల పంచాయతీ అధికారి శ్రవణ్‌కుమార్, ఎస్‌బీఎం జిల్లా కో-ఆర్డినేటర్ వేణు, పంచాయతీ కార్యదర్శులు భవాని, శ్రీనివాస్,ఏఎన్ఎం, అంగన్‌వాడీ, ఆశా, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

కరీంనగర్ క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఒంటరిగా నివసించే వారు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ) గౌస్ ఆలం సూచించారు. ఇటీవల కరీంనగర్ త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఒంటరిగా నిద్రిస్తున్న మహిళమెడలో నుంచి దొంగలు పుస్తెల తాడు ఎత్తుకెళ్లిన ఘటన సందర్భంగా మాట్లాడారు. నిద్రించే ముందు తలుపు గడియలు సరిగ్గావేసుకున్నారో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. ఊరెళ్లేవారు ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలని, బీరువాతాళాలను వెంటతీసుకెళ్లాలని సూచించారు. ఇంటి ప్రధాన ద్వారానికి సెంట్రల్ లాకింగ్ సిస్టమ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అపార్ట్‌మెంట్లలో సీసీకెమెరాలు, వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇళ్లకు తాళం వేసి వెళ్లే ముందు చుట్టుపక్కల వారికి, స్థానిక పోలీసుఠాణాకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

17 మంది హెడ్‌కానిస్టేబుళ్ల బదిలీ

కరీంనగర్ క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 17మంది హెడ్‌కానిస్టేబళ్లకు గురువారం బదిలీలు జరిగాయి. ఈమేరకు పోలీస్ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వీరందరికి అటాచ్‌మెంట్ బదిలీ చేశారు.

యువకుడి ఆత్మహత్య

కోరుట్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని ఆనంద్‌గిరి నగర్‌కు చెందిన తోకల శివ(20)అనే యువకుడు గురువారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు, స్థానికులు తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శివ ఉరివేసుకొని ఉండగా ఇంటికి వచ్చిన తల్లి చూసింది. చుట్టుపక్కల వారుగమనించి పోలీసులకు సమాచారం అందిచారు. చికిత్స నిమిత్తం శివను ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని తెలిపారు. పోలీసులు సూచనల మేరకు మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా కుటుంబ సభ్యులురాత్రి వరకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా తీవ్ర తలనొప్పితో బాధపడుతూ ఆత్మహత్య చేసుకున్నాడని కొందరు బంధువులు అనుకోగా, ఆన్‌లైన్‌గేమ్స్‌లో నష్టపోయినట్లు పలువురు చర్చించుకున్నారు.

వాతావరణ సమతుల్యతను కాపాడుకోవాలి



డీఎఫ్‌వో కార్యాలయ ఆవరణలో మొక్కను నాటుతున్న డీఎఫ్‌వో సీహెచ్ బాలామణి

కరీంనగర్ క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వాతావరణ సమతుల్యతను కాపాడాలంటే ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని కరీంనగర్ జిల్లాఅటవీశాఖ అధికారి సీహెచ్ బాలామణి పిలుపునిచ్చారు. వనమహోత్సవంలో భాగంగా గురువారం కరీంనగర్ అటవీశాఖ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ మాట్లాడుతూ మొక్కల పెంపకంతో వాతావరణ కాలుష్యం తగ్గుతుందని, భావి తరాలకు వృక్షసంపద సమకూరుతుందని అన్నారు. చెట్లను ఎక్కడికక్కడ నరకడం, గుట్టలు మాయమవడంతోనే ప్రకృతిలో అనేకమార్పులు వచ్చి వర్షాలు సమృద్ధిగా కురవడంలేదన్నారు. ప్రతీ పౌరుడు తమవంతు బాధ్యతగా ఇంటి పరిసరాలు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని, వాటి సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్‌రేంజి ఆఫీసర్(ఎఫ్ఆర్‌ఓ)లు షైకత్‌హుస్సేన్, షైకత్ అలీ, డిప్యూటీ ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ నర్సింగరావు, సూపరింటెండెంట్ నరేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. గురువా రం కలెక్టరేట్‌లో ప్రభుత్వభవనాల నిర్మాణం, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనపై ఇంజనీరింగ్, జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాపరిషత్,ఉపాధిహామీ, పంచాయతీ రాజ్ తదితరశాఖల ద్వారా వివిధ ప్రభుత్వభవనాల నిర్మాణం, మరమ్మతుకు మంజూరైన పనులు ఆగస్టులోగా పూర్తిచేయాలన్నారు. అధికారులు సమన్వయంతో నూరుశాతం గ్రౌండిం గ్ పూర్తిచేయాలని ఆదేశించారు. పీఎంశ్రీలో ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు.

ప్రభుత్వభవనాల్లోకి మార్చిన 73 అంగన్‌వాడీకేంద్రాలకు మరమ్మతులు అవసరమని, ఈ పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా పరిషత్ సీఈవో శ్రీనివాస్, ఇంజనీరింగ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైపు లైన్

- జలమయమైన రహదారి



పైప్‌లైన్ లీకై వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

మెట్‌పల్లిటౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని వెంకట్రావుపేట గ్రామ శివారులోని జాతీయ రహదారి పక్కన ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ గురువారం పగలడంతో రహదారి జలమయమైంది. రహదారిని ఆనుకొని ఉన్న మెయిన్ పైపులైన్ లీకేజీ కావడంతో భారీగా భగీరథ నీరు రోడ్డుపై ప్రవహించడంతో కాసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో గ్రామంలోని రహదారులు, ఇళ్లలోకి నీరు ప్రవేశించాయి. స్థానికులు అధికారులకు సమాచారం అందించడంతో మరమ్మతు పనులు చేపట్టారు. కాగా మెయిన్ పైప్ లైను లీకేజీ కావడంతో జిల్లా అంతటికి భగీరథ నీటి సరఫరా ఆగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

గంజాయి పట్టివేత

జగిత్యాల క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలో గురువారంటౌన్ ఎస్సై కుమారస్వామి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించి గంజాయి పట్టుకున్నారు. రాజీవ్‌చౌక్ ప్రాంతంలో పోలీసులను చూసి పెగడపల్లి మండ కేంద్రానికి చెందిన మల్యాలఅజేయ్ అనేవ్యక్తి పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకున్నారు. తనిఖీల్లో 120గ్రాముల గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. ద్విచక్రవాహనంతోపాటు గంజాయిని సీజ్ చేసి అజయ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత

ఎల్లారెడ్డిపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : చిన్న నాటి మిత్రుడి కూతురు అనారోగ్యంతో మృతిచెందడం. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో ఆపదలో మేమున్నామంటూ పూర్వ విద్యార్థులు, చేయూత మిత్ర ఫౌండేషన్ సభ్యులు ముందుకు వచ్చారు. మండల కేంద్రంలోని చిన్ననాటి స్నేహితుడు పూర్ణచందర్ కూతురు సాత్విక ఇంటర్మీడియట్ చదువుతూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. మిత్రుడి దీన స్థితిని తెలుసుకున్న సభ్యులు గురువారం రూ.15.5 వేల నగదును అందజేశారు. సభ్యులు సుధాకర్‌రెడ్డి, బాబా, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, కిషన్, ఆంజనేయులు, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన అంతెర్పుల ఎల్లవ్వ, ఎలగందుల మల్లవ్వ కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు గురువారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, బాబు, రాములు, నవాబ్, చందు, తిరుపతిగౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాము, ఇలియాస్, బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మహిళలకు అందిస్తున్న పథకాలపై కళాజాత ప్రదర్శన

ఎల్లారెడ్డిపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలోని ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న వివిధ పథకాలపై కళాకారులు గురువారం కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. ఇందిరా మహిళాశక్తి సంబరాల్లో భాగంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం మల్లేశం, సీసీలు దేవేందర్, రమణ, మంగ్యానాయక్, నాగరాజు, సుధాకర్, పద్మ, గౌతమి, వీవో అధ్యక్షురాలు మౌనిక, కళాకారులు, మహిళలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ఎల్లారెడ్డిపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు గురువారం అందజేశారు. నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, బాబు, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, విజయ్‌రెడ్డి, రవీందర్, బుచ్చాగౌడ్, రాములు, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద చిన్నారులకు ఆర్థికసాయం...

వీర్నపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో తోటి మిత్రుడు గోగుల రమేష్ కూతురు సంతోష చనిపోవడంతో తన వద్ద ఉంటున్న బిడ్డ కూతుర్లు లివ్యశ్రీ, సాన్విశ్రీ అనే నిరుపేద చిన్నారులకు చేయూత మిత్ర ఫౌండేషన్ సభ్యులు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని గురువారం అందించారు. సభ్యులు కుంబాల సుధాకర్‌రెడ్డి, దూస శ్రీనివాస్, కదిరె రవి, బందారపు లక్ష్మా రెడ్డి, మాదాసు నాగరాజు. మహమ్మద్ బాబాలు ఉన్నారు.

ఇందిరా మహిళా శక్తిపై కళాజాత బృందాల ప్రదర్శన

గంభీరావుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గాంధీ వద్ద గురువారం ఇందిరా మహిళాశక్తిలో భాగంగా ప్రభుత్వం మహిళలకు అందించే పలు పథకాలపై కళాజాత బృందాలు ప్రదర్శన ఇచ్చాయి. ఆకునూరి దేవయ్య ఆధ్వర్యంలోని కళాజాత బృందాలు పాటల రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో రాజరాజేశ్వరీ మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఎల్ బాగ్య, ఐకేపీ ఏపీఎం సుదర్శన్, సీసీలు బాబు, సురేందర్, పర్శరాములు, వనిత తదితరులు పాల్గొన్నారు.

రహీంఖాన్‌పేటలో స్వచ్ఛ సర్వేక్షన్ కమిటీ సభ్యుల పరిశీలన

ఇల్లంతకుంట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలో స్వచ్ఛసర్వేక్షన్ గ్రామీణ్ కమిటీ సభ్యులు గురువారం పరిశీలించారు. గ్రామంలోని మురుగనీటి కాలువలు, అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్య ఉపకేంద్రం, ఆదర్శ పాఠశాలతో పాటు ఇళ్లలో పారిశుద్యం ఎలా ఉందో పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు రావన్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను డంప్‌యార్డులో వేయాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అనూష, సురేష్, ఎంపీడీవో శశికళ, ఎంపీవో శ్రీనివాస్, ఏపీఎం చంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి సంధ్య, ఫీల్డ్‌అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను చెల్లించాలి

ఇల్లంతకుంట, జూలై 10 (ఆంధ్రజ్యోతి):ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణరాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్ కోరారు. మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో గురువారం సభ్యత్వాలను సేకరించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రెంటాల రమణారెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు పచ్చిమట్ల అనీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వెల్ది కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ కిట్ అందజేత



విశ్వకర్మ కిట్‌ను అందిస్తున్న బండి సంజయ్

ఇల్లంతకుంట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : విశ్వకర్మ కిట్‌ను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అందించారు. మండలంలోని వంతడుపుల గ్రామస్థులు గురువారం కరీంనగర్‌లో బండి సంజయ్‌కుమార్‌ను కలిశారు. గ్రామంలోని తాగునీటి బావికి కొత్త విద్యుత్ మోటార్‌ను అందించాలని, ముదిరాజ్ సంఘానికి రూ 2లక్షలు కేటాయించాలని వినతిపత్రం ఇచ్చారు. దీనికి కేంద్రహోంశాఖ మంత్రి సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో సామ బాల్‌రెడ్డి, చిమ్మనగొట్టు శ్రీనివాస్, గొడుగు అంజనేయులు, బాలరాజు, కనుకయ్య, స్వామి, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఇల్లంతకుంట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంతడుపులలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కరీంనగర్‌లోని సన్‌రైజ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో 200మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి వెంకటేష్, క్యాంప్ మేనేజర్ సతీష్, ఆర్ఎంపీ శ్రీనివాస్, శ్రీధర్, దొమ్మాటి అనీల్, గడ్డమీది తిలక్, పిల్లి లచ్చయ్యలతో పాటు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

తంగళ్లపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బొల్లారం చంద్రమౌళి జెండా ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పసుల సుధాకర్, పసుల కమలాకర్, బొల్లారం తిరుపతి, బొల్లి కరుణాకర్, పసుల డేవిడ్ రాజు, బూడిద సంతోష్, పసుల రఘు, బొల్లారం నానాక్, బందారం ప్రేమ్, దొమ్మటి రాజయ్య, బొల్లారం దుర్గయ్య, తిరుపతి, రాజు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

రుద్రంగి, జూలై 10(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేష్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు కర్నవత్తుల వేణు ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పడాల గణేష్, బోయిని రాజు, తాళ్లపల్లి బాల కిషన్‌రావు, అల్లూరి రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

యోగా గురువుకు సన్మానం

గంభీరావుపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రంలో ఉచితంగా యోగా నేర్పిస్తున్న గురువు పెరిమెల్లి దేవయ్యను గురుపౌర్ణమి సందర్భంగా గురువారం ఘనంగా సన్మానించారు. రమేష్, నాగరాజు, కృష్ణ, సత్యనారాయణ, శ్రీనివాస్, బాలరాజు, సుధాకర్, రాజారాం ఉన్నారు.

వాటర్ ప్లాంట్ అందజేత

చందుర్తి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం జోగాపూర్ ప్రాథమిక పాఠశాలకు 2011-12 విద్యా సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు వాటర్ ప్లాంట్‌ను గురువారం అందజేశారు. ప్రధానోపాధ్యాయులు శ్రీలత, ఉపాధ్యాయులు ఎడ్ల కిషన్, వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు సాయి, పవన్, అనిల్, ప్రశాంత్, హరీష్, రవి, వంశీ, మనోహర్, రాజు, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు


వేములవాడలో సాయిబాబాకు క్షీరాభిషేకం చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


అన్నదానం చేస్తున్న ప్రతాప రామకృష్ణ, చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : గురు పూర్ణిమ వేడుకలు తిప్పాపూర్, వేములవాడ పట్టణంలోని షిరిడి సాయిబాబా దేవాలయంలో గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక మార్కండేయ నగర్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా సేవ సంస్థాన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గురుపూర్ణిమ ఉత్సవాలు జరిగాయి. ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ సాయిబాబాను దర్శించుకుని సాయిబాబా విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ నేత ప్రతాప రామకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఏనుగు మనోహర్‌రెడ్డి, పట్టణ సీఐ వీరప్రసాద్ తదితరులు సాయిబాబాను దర్శించుకున్నారు. షిరిడి సాయిబాబా సేవా సంస్థ ట్రస్ట్ అధ్యక్షుడు వారాల దేవయ్య, కోనమ్మగారి నాగరాజు, కూర రమేష్, ఏంబేరి నర్సయ్య, తొగరి వెంకటేష్, తడకొండ కృష్ణస్వామి తదితరులు ఉపాధ్యాయులను, గురువులను సన్మానించారు. అన్నదానం కార్యక్రమానికి విరాళం అందించిన దాతలకు ట్రస్టు అధ్యక్షుడు వారాల దేవయ్య కృతజ్ఞతలు తెలిపారు.

● సిరిసిల్ల టౌన్ : సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకమైందని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిని గోపి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురు పౌర్ణమి సందర్భంగా గురువులను సన్మానించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, సీనియర్ నాయకుడు గరిపెల్లి ప్రభాకర్, సుధాకర్, మోర రవి పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, నారాయణపూర్, బండలింగంపల్లి, అల్మాస్‌పూర్, తదితర గ్రామాల్లో గురు పౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సాయిబాబా, సత్సంగ సదనం, గొల్లపల్లి గీతా మందిరంలో శ్రీకృష్ణం వందే జగత్ గురువు సభ్యులు, వేద పండితులు గుండయ్యశర్మ, రాచర్ల రఘురామశర్మ, హన్మండ్లుశర్మ, సత్సంగ సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డిలకు పాద పూజ చేసి సన్మానించారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యుడు సత్యనారాయణస్వామిని పీఎంపీలు సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

● ముస్తాబాద్ : మండలంలో గురుపౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. హరిహర పుత్ర అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరాజు గురుస్వామిని సత్కరించారు. గజమాలతో దంపతులను అభినందించారు. రాంగోపాల్, నాగరాజు, రాము, అంజాగౌడ్, దేవేందర్, సత్యనారాయణ, వెంకటేశం, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండలంలోని నాగంపేటలో సద్గురు సాయినాథ దత్తాత్రేయ దేవాలయంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, తీర్థప్రసాదం, పులీహోర నైవేద్యం సమర్పించారు. రాచర్ల మృత్యుంజయం శర్మపంతులు, రాచర్ల రాజేశ్వరశర్మ పంతులు పూజలు చేశారు.

● వేములవాడ రూరల్ : గురుపౌర్ణమి వేడుకలు గురువారం మండలంలో ఘనంగా జరిగాయి. ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి హన్మాజీపేట గ్రామంలోని సాయిబాబ ఆలయంలో వేర్వేరుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● రుద్రంగి : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా పల్లకి సేవ నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, తిపిరెడ్డి వేంకట్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, తీగల శ్యామ్‌రావు, ఏంగల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : గురుపౌర్ణమి సందర్భంగా విద్యార్థులు గురువులను సన్మానించారు. కనగర్తి ఎంపీపీఎస్ పాఠశాలలో గురు పౌర్ణమి సందర్భంగా ఉపాధ్యాయులను విద్యార్థులు కప్పి సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సిరిసిల్లలో గురువులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

అనారోగ్యంతో ప్రధానోపాధ్యాయుడి మృతి


వేణుమాధవ్(ఫైల్)

వీర్నపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : అధిక రక్త పోటుతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం మద్దిమల్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుమాధవ్(52) గురువారం మృతిచెందాడు. స్థానికంగా ఉంటూ మదిమల్ల ప్రభుత్వ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన 3రోజుల క్రితం బీపీ, షుగర్ అధికమై అనారోగ్యంతో ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరగా, చికిత్స పొందుతూ గురువారం ఉదయం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడి మృతికి ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేసి పాఠశాలకు సెలవు ప్రకటించారు. ఆసుపత్రిలో వేణుమాధవ్ మృతదేహానికి మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్, టీకోడు పాఠశాల ఉపాధ్యాయులు నివాళులర్పించారు.మృతదేహాన్ని స్వగ్రామం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఎంఈవో శ్రీనివాస్‌తో పాటు ఉపాధ్యాయులు అంత్యక్రియల్లో పాల్గొని ఖర్చుల కోసం రూ.20వేలు అందించారు. వేణుమాధవ్ గతంలో జర్నలిస్టుగా పనిచేయగా, పలువురు జర్నలిస్టులు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య అరుణ, కుమారుడు సాయిగణేష్, కూతురు విజిత ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

సిరిసిల్ల క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం మానేరు వంతెనపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై తంగళ్లపల్లి వైపు వెళుతుండగా ఎదురుగా సిద్దిపేట వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో భరత్, రాజు అనే ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ సంఘటన తమ పరిధిలోకి రాదని సిరిసిల్లటౌన్, తంగళ్లపల్లి పోలీసులు తేల్చుకోలేని పరిస్థితి ఏర్పడింది.

మత్స్యకారులకు ప్రభుత్వం అండ..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మత్స్యకారులను సన్మానిస్తున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని చంద్రంపేట రైతు వేదికలో నేషనల్ అగ్రో ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మత్స్య రైతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని ఉత్తమ ప్రతిభకనబరిచిన సొసైటీ సభ్యులకు ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. అనంతరం చేపల స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లాలో మత్స్య సంపద పెంపొందించడానికి తన వంతు ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. మంత్రి శ్రీహరి ఇటీవల కరీంనగర్ వచ్చినప్పుడు వారితో చేపల పెంపకం, మత్స్యకారుల గురించి మాట్లాడం జరిగిందన్నారు. ప్రభుత్వం అన్ని చెరువుల్లోకి సకాలంలో చేపపిల్లలు పంపిణీ చేస్తుందని తెలిపారు. బలహీన వర్గాలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం తోడ్పాటు అందజేస్తుందని అన్నారు. గతంలో మిడ్‌మానేరులో చేపలను వదలడం జరిగిందని, మల్కాపేట్ రిజర్వాయర్ కూడా అందుబాటులోకి వచ్చిందని వాటిలో కూడా చేపల పెంపకం ఏర్పాట్లు విధానం పరిశీలించాలన్నారు. గతంలో తెగిపోయిన చెరువులు మరమ్మతులు పూర్తి చేశామని అన్నారు. ఇంకా ఎక్కడ చెరువులు మరమ్మతులు ఉంటే చేపడతానని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన మూడు నెలల్లోనే కథలాపూర్ మండలంలోని తెగిపోయిన చెరువులను మరమ్మతులు చేసినట్లు తెలిపారు. మల్కాపేట రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసి ఎల్లారెడ్డిపేట వరకు రైతులకు సాగు నీరు అందించమని తెలిపారు.గతంలో మిడ్ మానేరు ప్రాజెక్టులో కేజీ కల్చర్ విధానంలో చేపల పెంపకం కోసం ముంపు గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించమని, కేజీ కల్చర్ చేపల పెంపకం చేపట్టడం కోసం ముందుకు రావాలన్నారు. చేపల పెంపకంలో అధునాతన సాంకేతినను అందిపుచ్చుకోవాలన్నారు. కేజీ కల్చర్ విధానంలో చేపల పెంపకానికి ముందుకు వస్తె ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందని తెలిపారు. దేశంలో మత్స్య సంపద పెరగాలని, చేపలు ఆరోగ్యానికి మంచిదని, ప్రభుత్వం మత్స్యకారులకు అనేక రకాలుగా ప్రోత్సాహకాలు అందజేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం పెట్టిన ఒక్క పథకాన్ని కూడా రద్దు చేయకుండా వాటిని కొనసాగిస్తూ నూతన పథకాలను అమలుచేస్తున్నామన్నారు ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట మేరకు మహిళ తల్లులకు ఉచిత బస్సు ప్రయాణం, రూ 500కు సిలిండర్, రూ10లక్షల ఆరోగ్యశ్రీ, 10 సంవత్సరాలుగా పేదలు ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇల్లు, నూతన రేషన్‌కార్డులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూపరెడ్డి, జిల్లా ఫిషరీస్ చైర్మన్ చొప్పరి రామచంద్రం, డీఏవో అఫ్జల్‌బేగం, మల్లికార్జున్, పి కిషోర్, నేషనల్ అగ్రో ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ సునీల్‌కుమార్, అడ్వైజర్ విద్యాసాగర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్‌సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, ఆకునూరి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం వైపు అడుగులు..

(5వ పేజీ తరువాయి)

నాటగా 18,54, 541 మొక్కలు బతికి ఉన్నాయి. 2023-24 సంవత్సరంలో ఉపాధిహామీ కింద 6,92,099 మొక్కలు నాటారు. ఇందులో 6,67,980 మొక్కలు బతికి ఉన్నాయి. 2024-25 సంవత్సరానికి 6.06 లక్షల మొక్కలు నాటారు.

శాఖల వారీగా లక్ష్యాలు..

వనమహోత్సవం లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి జిల్లాలో ప్రభుత్వ శాఖలవారీగా లక్ష్యాలుగా పెట్టుకున్నారు. ఈసారి కూడా అత్యధికంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 6.77లక్షల మొక్కలు నాటే లక్ష్యంగా పెట్టుకున్నారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలో 2,08,700 మొక్కలు, అటవీశాఖ 72,000, నీటిపారుదల శాఖ 7,600, వ్యవసాయ శాఖలో 25,500, ఎక్సైజ్‌శాఖ 27,100, విద్యా శాఖ 2వేలు, ఉద్యానవన శాఖ 6,400, ఆర్అండ్‌బీ శాఖ 4 వేలు, వైద్య ఆరోగ్య శాఖ 2వేలు, పోలీస్‌శాఖ 4,600 మైనింగ్‌శాఖ 200, పరిశ్రమల శాఖ వెయ్యి మొక్కలు నాటే లక్ష్యంగా పెట్టుకున్నారు.

వనమహోత్సవంలో భాగస్వాములు కావాలి

- శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి



పచ్చదనం పెంచే మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములుకావాలి. జిల్లాలో వివిధ గ్రామాల్లో వనమహోత్సవంలో మొక్కలునాటడం ప్రారంభించారు. జిల్లాలో ఈసారి 10.38 లక్షల మొక్కలు నాటే లక్ష్యంగా పెట్టుకున్నాం. వివిధ శాఖల ఆధ్వర్యంలో జరిగే మొక్కలు నాటే కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలి. ఇళ్లలో పెంచుకోవడానికి పండ్లు, పూల మొక్కలను కూడా అందిస్తున్నాం.

గిరిజన బిడ్డకు నీట్‌లో 398వ ర్యాంకు..


శ్రీప్రణతి

ముస్తాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సేవాలాల్ తండాకు చెందిన డాక్టర్ భూక్య చందర్, డాక్టర్ భూక్య అరుణ దంపతుల కూతురు శ్రీ ప్రణతి మొదటి ప్రయత్నంలోనే నీట్‌లో 398వ ర్యాంకు సాధించింది. భూక్య చందర్ వృత్తిరీత్యా సిద్దిపేటలో ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. ప్రణతిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె తారకరామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు అభినందించారు.

మెరుగైన వైద్యం అందించాలి

ఎల్లారెడ్డిపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నిందితుడిని కఠినంగా శిక్షించడంతో పాటు అంగన్‌వాడీ టీచర్‌కు మెరుగైన వైద్యం అందించాలని అంగన్‌వాడీ టీచర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సాయిఈశ్వరి డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామ శివారులో ఇటీవల ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళుతూ ప్రమాదానికి గురై ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రితో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ టీచర్ మారోజు స్వరూప ఆరోగ్య పరిస్థితిని గురువారం ఆమె తెలుసుకున్నారు. ఘటనకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. మద్దిమల్లలో విధులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్లేందుకు వేచిచూస్తున్న స్వరూపను ఓ యువకుడు బైక్‌పై ఎక్కించుకుని అటవీ ప్రాంతంలోకి తీసుకెళుతూ అసభ్యకరంగా ప్రవర్తిండంతో ఆమె ప్రమాదానికి గురైందని కుటుంబ సభ్యులు వివరించారు. స్వరూపకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలని కోరారు. యువకుడిని కఠినంగా శిక్షించాలని లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని సాయి ఈశ్వరి హెచ్చరించారు. ఆమె వెంట ఏఐటీయూ సీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, నాయకులు అనసూర్య, అజ్జు, వేణు, అంగన్‌వాడీ ఉపాధ్యాయినులు అంజలి, పద్మ, జ్యోతి, వాణి, సులోచన తదితరులు ఉన్నారు.

వాహనాలకు వేలం

ఎల్లారెడ్డిపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయం ఆవరణలో ఆ శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో గురువారం వాహనాలకు వేలం పాటలు నిర్వహించారు. వివిధ కేసుల్లో పట్టుబడిన 7 వాహనాలకు వేలం పాటలు జరిపారు. 4 వాహనాలను పలువురు వేలం పాటల ద్వారా దక్కించుకున్నారు. ప్రభుత్వానికి రూ.1.19 వేల ఆదాయం సమకూరిందని అధికారి శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. మిగిలిన మూడు వాహనాలకు త్వరలో తిరిగి వేలం నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ సీఐ శ్రీనివాస్, సిబ్బంది రాజు, వర్మయోగి, కిశోర్‌కుమార్, కృష్ణకాంత్, అమృత్‌రెడ్డి, మల్లేశ్, లలిత, దివ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి

- అటవీశాఖ రేంజ్ అధికారి ఖలీలుద్దీన్



గర్జనపల్లిలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న ఎఫ్ఆర్వో

వీర్నపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జీవించే ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని చందుర్తి మల్యాల అటవీ శాఖ రేంజ్ అధికారి ఖలీలుద్దీన్ అన్నారు. వీర్నపల్లి మండలంలోని వేములవాడ రేంజ్, సిరిసిల్ల రేంజ్ పరిధిలోని గర్జనపల్లి, రంగంపేట గ్రామాల అటవీ ప్రాంతంలో అటవీశాఖ అధికారులు, నాయకులు వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం మొక్కలను నాటారు. నాటిన మొక్కలను సంరక్షించడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కల పెంచాలన్నారు. పాఠశాలలో అధికారులు, విద్యార్థులు వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, తహసీల్దార్ ముక్తార్ పాషా, వీర్నపల్లి, అల్మాస్‌పూర్, గర్జనపల్లి, గొల్లపల్లి అటవీ సెక్షన్ అధికారులు రంజిత్‌కుమార్, పద్మలత, అజిమోద్దిన్, సక్కారం, ప్రధానోపద్యాయులు శ్రీనివాస్, గజన్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ రాకేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ లింగం, బీట్ అధికారులు వేణు, కిరణ్, లావణ్య, సతీష్, శ్రీకాంత్, బేస్‌క్యాంపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

చందుర్తి, జూలై 10(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ యాప్‌ను ప్రతిఒక్కరు స్మార్ట్ ఫోన్‌లో డౌన్లోడ్ చేసుకోవాలని ఎంపీడీవో రాదా అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ 2025 కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం సందర్శించారు. స్వచ్ఛసర్వేక్షణ్ యాప్‌పై విద్యార్థులకు అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ప్రదీప్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ రమాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపన్యాస పోటీలు

చందుర్తి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం సనుగుల ప్రాథమిక పాఠశాలలో గురు పూర్ణిమ సందర్భంగా గురువారం విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించార. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ముఖేష్ మాట్లాడుతూ గురువులు జ్ఞానాన్ని, వివేకాన్ని, నైతిక విలువలను బోధించి విద్యార్థులను సరైన మార్గంలో నడిపిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేకే మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

సిరిసిల్ల టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం కాంగ్రెస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జి చక్రధర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, ప్రధాన కార్యదర్శి వెంగల అశోక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండలంలో వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించారు. స్థానిక సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, రాజేందర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలో వేడుకలను నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి వర్మ హన్మండ్లు, కొమిరిశెట్టి తిరుపతి, మూల రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

● ముస్తాబాద్ : మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, గాంత రాజు తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మండల కేంద్రంలో వేడుకల్లో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, మునిగేల రాజు, సత్తు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.